ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.3, కనిష్ఠం 24.5

కామారెడ్డి
జిల్లా వార్తలు

5

శనివారం 18 మే 2024



ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్, మే 17: కామారెడ్డి ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ అధికారి రవీందర్‌నాయక్‌కు ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల మహిళ ఉద్యోగులపై వేధింపుల కేసులో డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సంఘటనలపై విచారణ కొనసాగుతుండడంతో ఆయన స్థానంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోకు బాధ్యతలు అప్పగించారని తెలుస్తోంది. గతంలో డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ రాకముందు చంద్రశేఖర్ డీఎంహెచ్‌వోగా బాధ్యతలు నిర్వహించారు.



తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



బీబీపేటలో ధాన్యం తడవకుండా టార్పాలిన్‌లు కప్పిన దృశ్యం



బీబీపేటలో ధాన్యం సంచులలో నింపిన దృశ్యం

మబ్బులతో గుబుల్

- జిల్లాను కమ్మేస్తున్న కారుమబ్బులు
- గత మూడు రోజులుగా అకాల వర్షాలు
- రోడ్లపై కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం రాశులు
- ఎప్పుడు అకాల వర్షాలు కురుస్తాయోనని ఆగమవుతున్న అన్నదాతలు
- అప్రమత్తమై వడ్ల కుప్పలపై పరదాలు కప్పుతున్న రైతులు
- జిల్లాలో ఇప్పటి వరకు 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

కామారెడ్డి, మే 17(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పులతో రోడ్లు, కొనుగోలు కేంద్రాల్లో వడ్లు, మొక్కజొన్నలను ఆరబెట్టిన రైతులు ఆందోళనకు గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న అకాల వర్షాలు రైతులు భయపెడుతున్నాయి. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ వాతావరణం అంతా చల్లబడింది. ఆకాశం మేఘావృతమై ఉండడంతో ఆరబోసిన వడ్లు, మొక్కజొన్నలు వర్షానికి ఎక్కడ తడుస్తాయోనని రైతులు పరదాల కోసం పరుగులు తీస్తున్నారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు పంట పొలాలు, రోడ్లు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యంపై పరదాలు కప్పడం కనిపిస్తోంది. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు వెనువెంటనే కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షాలు కురుస్తున్నాయని ఎక్కడ నష్టపోవాల్సి వస్తుందోనని రైతులు ధాన్యాన్ని కాపాడుకునేందుకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

నెమ్మదించిన భానుడు

జిల్లాలో గత వారం రోజుల కిందట ఎండలు దంచికొట్టాయి. భానుడు గత నాలుగు రోజుల నుంచి నెమ్మదించడంతో వాతావరణం చల్లబడింది. గత వారం క్రితం జిల్లాలో 45 డిగ్రీలకు పైగానే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అంటే సాధారణ ఉష్ణోగ్రతల నుంచి 8 డిగ్రీల ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదైన సంగతి తెలిసిందే. దీంతో జిల్లా ప్రజలు ఎండల తీవ్రతలకు హడలెత్తిపోయారు. అయితే గత నాలుగు రోజుల నుంచి జిల్లాను కారుమబ్బులు కమ్మేస్తుండడం, ఆకాశం మేఘావృతమై అకాల వర్షాలు కురుస్తున్నాయి. వాతావరణం చల్లబడిందని ప్రజలు ఆనందిస్తున్నప్పటికీ రైతుల్లో మాత్రం ఆందోళన నెలకొంటుంది. చేతికొచ్చిన పంట ఎక్కడ వర్షం పాలవుతుందోనని రైతులు దిగాలు చెందుతున్నారు.

ఆకాశాన్ని కమ్మేస్తున్న మబ్బులు

ప్రతీ యాసంగి సీజన్‌లో కోతలు, కొనుగోళ్ల సమయంలో అకాల, వడ్లగండ్ల వర్షాలు కురువడం సాధారణమే. సరిగ్గా కోతల సమయంలోనే కురుస్తుండడంతో ప్రతీ ఏటా రైతుల ధాన్యం తడిసిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఇటీవల వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు ఆకాశాన్ని కారుమబ్బులు కమ్మేస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో అక్కడక్కడ అకాల వర్షాలు కురిస్తే కొనుగోలు కేంద్రాల్లో, రోడ్లపై, పంట పొలాల్లోని ధాన్యం ఎక్కడ తడిసిపోతుందోనని రైతులు ఆగమవుతున్నారు. దీంతో అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులు పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతున్నాయి.

పరుగులు తీస్తున్న రైతులు

జిల్లాలో వాతావరణం ఉన్నట్టుండి మారిపోవడంతో కేంద్రాల్లోని ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు పరుగులు తీస్తున్నారు. కోతకు వచ్చిన పొలాలు గాలి దుమారానికి, వర్షానికి అడ్డం పడుతాయని ధాన్యం రాశులు తడిసిపోతాయోమోనని ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడు ఏ గాలి దుమారం వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పంటను కోసి కల్లాలు, కేంద్రాల్లో ఆర బెట్టుకుంటున్న రైతులు కుప్పలుగా పోసి పట్టాలు కప్పుకునేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సరిపడ టార్పలిన్‌లు అందుబాటులో లేకపోవడంతో తెలిసిన వారి వద్ద కొనుగోలు చేసి ధాన్యం రాశులపై కప్పుకుంటున్నారు.

ఇప్పటి వరకు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు దగ్గర పడుతున్నాయి. అకాల వర్షాలతో కొనుగోళ్లలో కాస్త ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మరోవైపు ధాన్యం కొనుగోళ్లు జరిగినప్పటికీ లారీల కొరతతో మిల్లులకు ధాన్యాన్ని తరలించడంతో ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 44,845 మంది రైతుల నుంచి రూ.500 కోట్లు విలువ చేసే 2.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. రైతుల ఖాతాలో రూ.490కోట్లు ధాన్యం డబ్బులను జమ చేశారు. 97 శాతం రైతుల కొనుగోళ్ల వివరాలను ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశారు. మరో పక్షం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.



లింగంపేటలో బాలికల ఉన్నత పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి

● కలెక్టర్ జితేష్ వి. పాటిల్

లింగంపేట, మే 17: జూన్ 12లోపు అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండలంలోని బాలికల ఉన్నత పాఠశాల, బాలికల ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భవనాలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్, మరుగుదొడ్ల మరమ్మతుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. మండల కేంద్రంలోని బాలికల పాఠశాల శిథిలావస్థకు చేరినందున పాఠశాల గదుల పై కప్పులను తొలగించి రేకుల షెడ్లు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. పాఠశాలల్లో అవసరం ఉన్న పనులను చేపట్టడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ నరేష్, ఎంఈవో రామస్వామి, పీఆర్ ఏఈ రాకేష్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

విఠల్‌వాడీ పాఠశాలను బాగు చేయిస్తాం

పెద్ద కొడప్‌గల్: మండలంలోని విఠల్‌వాడీ పాఠశాలను జూన్ నెలలోగా బాగు చేయిస్తామని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని విఠల్‌వాడీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పై కప్పు బాగాలేక వర్షపు నీరు వస్తుందని స్థానికులు తెలిపారని, జూన్‌లో విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యేలోగా పాఠశాల పైకప్పు తొలగించి పాఠశాలకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు గాను సిమెంట్ రేకులు వేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటుగానే పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. వాటితో పాఠశాల ఆవరణలో పురాతన గదులను కూల్చివేసి నూతనంగా నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి విద్యాధికారి దేవీసింగ్, ఏఈ చందూ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగామణి పాల్గొన్నారు.

ధాన్యాన్ని సేకరించి పంపించాలి

నిజాంసాగర్: నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సేకరించిన ధాన్యాన్ని వెంటనే ట్యాగ్ చేసి మిల్లులకు తరలించాలని కలెక్టర్ జితేశ్ వి. పాటిల్ అన్నారు. శుక్రవారం నిజాంసాగర్ మండలంలోని ఆరేపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. స్థలాభావం వల్ల ప్రస్తుత యాసంగిలో ధాన్యం అన్‌లోడ్ చేసుకోవడంలో కాస్త ఆలస్యం అవుతుందన్నారు. ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు, గన్నీ సంచులు అందుబాటులో ఉంచుకోవాలని, బ్యాగులు సిద్ధం చేసిన వెంటనే లారీలను తెప్పించుకుని లోడింగ్ చేసి పంపాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 44,845 మంది రైతుల నుంచి 550 కోట్ల విలువ గల రెండున్నర లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి 490 కోట్లు రైతుల ఖాతాలో జమ చేశామని, 97 శాతం టాబ్ ఎంట్రీ కూడా పూర్తయిందని, త్వరలో మిగతా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని కలెక్టర్ తెలిపారు.

సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదం

ముగ్గురు మద్నూర్ వాసుల మృతి



మృతులు శ్రీనివాస్, సునీత, బాలుడు నగేష్

మద్నూర్, మే 17: మద్నూర్ మండలం పెద్ద తడ్గూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, సునీత దంపతులతో పాటు వారి కుమారుడు నగేష్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయమై కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు. తడ్గూర్‌కు చెందిన రాంబాయి కుమారుడు శ్రీనివాస్(35) గత కొన్ని రోజులుగా హైదరాబాద్‌లోని పటాన్ చెరువులో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు సంతానం. యువరాజు, నగేష్, చిన్న కుమారుడు నగేష్ తల్లిదండ్రులతో పాటు హైదరాబాద్‌లో ఉండేవాడు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఆదివారం మద్నూర్‌మండలం తడ్గూర్ గ్రామానికి వచ్చినట్లు కుటుంబీకులు తెలిపారు. తిరిగి శుక్రవారం ద్విచక్ర వాహనంపై తిరిగి వెళుతుండగా, సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం రాంసాన్‌పల్లి 101 జాతీయ రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి రోడ్డు కిందకు పడిపోవడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. తడ్గూర్ గ్రామంలో కేవలం ఒక ఎకరం భూమి ఉండగా, దాంతో ఆదాయం రాకపోవడంతో గత ఆరు సంవత్సరాలుగా పటాన్ చెరువు వద్ద భవన నిర్మాణం పనుల్లో కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్న శ్రీనివాస్ ఆయన భార్య సునీత మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇంటి వద్ద ఆర్థిక వనరులు లేక అక్కడ జీవనం గడుపుతున్నారని, శుక్రవారం 10 గంటలకు తడ్గూర్ నుంచి తల్లికి చెప్పి తిరిగి కూలికి బైక్ పై హైదరాబాద్‌కు వెళుతుండగా, సంఘటన జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్‌బాబు

కామారెడ్డి టౌన్, మే 17: కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని రైతులు అధైర్యపడవద్దని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి మల్లికార్జున్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైస్‌మిల్లుల్లో గత యాసంగి, వానాకాలానికి సంబంధించిన ధాన్యం నిల్వలు ఉండడం, స్థలాభావం వల్ల ప్రస్తుత యాసంగి ధాన్యం అన్‌లోడ్ చేసుకోవడంలో కాస్త ఆలస్యమవుతుందని అన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా మిల్లుల్లో స్థలాన్ని సర్దుబాటు చేసుకుని త్వరితగతిన అన్‌లోడ్ చేసుకుని లారీలను తిప్పి పంపాల్సిందిగా రైస్ మిల్లర్‌లను ఆదేశించామన్నారు. అదేవిధంగా ధాన్యాన్ని ఇతర జిల్లాలకు తరలించుటకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాగా నిజాంసాగర్ మండలం కోమలాంచలో ధాన్యం సేకరణ మెల్లగా జరుగుతున్నదని రైతులు ధర్నాకు దిగగా వారికి సమస్యను వివరించి వెంటనే కేంద్రానికి లారీలు పంపి అక్కడి నుంచి సమీప రైస్‌మిల్లుకు ధాన్యం తరలించామని, రైతులు కూడా ధర్నాను విరమించారని ఆయన తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు అవసరమైన లారీలను వెంట వెంటనే సమకూర్చవల్సిందిగా ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్‌ను ఆదేశించామని, కేంద్రం నిర్వాహకులు కూడా ధాన్యం తూకం వేసిన వెంటనే ట్యాగింగ్ చేసిన మిల్లులకు తరలించాలని ఆదేశించారు.



భిక్కనూరులో మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

మహిళా సంఘాల్లో.. అవినీతికి అడ్డుకట్ట!

- జిల్లాలో అవినీతికి పాల్పడ్డ పలువురు సిబ్బంది
- అప్రమత్తమైన అధికారులు
- ప్రతీ సభ్యురాలికి వ్యక్తిగత పాస్‌బుక్ ఏర్పాటు
- ఇకపై పాస్‌బుక్‌లో ప్రతీది నమోదు
- అవినీతికి పాల్పడ్డ వారిపై చర్యలు శూన్యం

భిక్కనూరు, మే 17: ఆర్థికంగా కొంతలో కొంత అభివృద్ధి చెందుదామని పొదుపు సంఘాల్లో చేరిన సభ్యులు వారి రెక్కలను ముక్కలు చేసుకుని రూపాయి రూపాయి పోగు చేసుకున్న డబ్బులతో పాటుగా, బ్యాంకు, స్త్రీనిధి, గ్రామ సంఘాల్లో తీసుకున్న రుణాల డబ్బును కట్టకుండా కంచె చేనును మేసినట్లు సంఘం సభ్యుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని పొదుపు సంఘాల్లోని కొందరు వీవోలు, సీసీలు, ఇతర సిబ్బంది అవినీతికి పాల్పడుతూ మహిళలను ఆగంమాగం చేస్తున్న సంఘటనలు ఇటీవల చాలానే వెలుగులోకి వస్తున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా పలు పొదుపు సంఘాల్లో రూ.కోట్లలో జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అవినీతికి పాల్పడ్డ వారికి కొందరు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు అండగా నిలవడంతో పాటుగా వారిపై పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేస్తే వారు వాడుకున్న డబ్బులు చెల్లిస్తారో లేదో అన్న సందేహంతో అధికారులు వారిపై చర్యలకు వెనుకాడుతున్నట్లు సమాచారం. ఐకేపీ అధికారులు సైతం చిన్న మొత్తంలో అవినీతి జరిగినప్పుడే గుర్తించకపోవడంతో అవినీతికి పాల్పడుతున్న వీవోఏలు, సీసీలు, ఇతరులు రెచ్చిపోతున్నారు. వీటితో పాటు మహిళా సంఘాల సభ్యులకు తెలియకుండానే వారిపై మరి కొందరు వీవోఏలు, సీసీలు కలిసి రుణాలు తీసుకోవడం, సభ్యులు తీసుకున్న రుణాలకు చెల్లించే వాయిదాల కన్నా ఎక్కువగా వాయిదాలను కట్టించుకోవడంతో పాటుగా తదితర సమస్యల పరిష్కారానికి ఎట్టకేలకు ఐకేపీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.

ప్రతీ సభ్యురాలికి వ్యక్తిగత పాస్‌బుక్ ఏర్పాటు

గతంలో ప్రతీ మహిళ సంఘ సభ్యురాలికి తప్పకుండా వ్యక్తిగత పాస్‌బుక్ ఉండేది. ఇందులో సదరు సభ్యురాలికి సంబంధించిన పొదుపు, తీసుకున్న రుణాలు, తీసుకున్న రుణానికి వాయిదాలు ఎన్ని, ఇంకా చెల్లించాల్సిన వాయిదాలు ఎన్ని ఇలాంటి ప్రతీ విషయాన్ని ఆ పాస్‌బుక్‌లో పొందుపరిచేవారు. పొదుపు సంఘాల్లో చాలా మందికి గతంలో రాయడానికి రాకపోవడంతో ఆ పాస్‌బుక్‌లలో, సంఘానికి సంబంధించిన రిజిస్టర్లను బుక్ కీపర్లు రాసేవారు. వీటిని రాసినందుకు సంఘం తరఫున కొంత డబ్బును ఇచ్చేవారు. కానీ రానురానూ సమయం, పనిభారం ఎక్కువ అవుతుందని ఈ వ్యక్తిగత పాస్‌బుక్‌లను రాయడం మానేశారు. కానీ ఇటీవల అవినీతి ఎక్కువ జరుగుతుండటంతో తిరిగి అధికారులు సభ్యురాలి వ్యక్తిగత పాస్‌బుక్‌ను మరల ఈ సంవత్సరం మొదటి నుంచి ప్రారంభించారు. దీనిలో సభ్యురాలికి సంబంధించిన పొదుపు, రుణాలు, వాయిదాలతో కూడిన వివరాలను పొందుపరుస్తూ అవినీతికి చెక్ పెడుతున్నారు.

అవినీతికి పాల్పడిన వారిపై చర్యలు శూన్యం

మహిళ సంఘం సభ్యుల డబ్బును వ్యక్తిగతానికి వాడుకుని ఇప్పటి వరకు జిల్లాలో అవినీతికి పాల్పడిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవడంలో వెనుకడుగు వేస్తున్న పరిస్థితి. అవినీతికి పాల్పడిన వారిపై పోలీసుస్టేషన్‌లో ఒక వేళ ఫిర్యాదు చేస్తే వారి నుంచి డబ్బులను తిరిగి రావేమోనన్న ఉద్దేశ్యంతో పాటుగా ఇలాంటి వాటిలో కొందరి ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు జోక్యం చేసుకోవడంతో వారిపై ఫిర్యాదు చేయడానికి వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. దీంతో ఐకేపీ అధికారులు అవినీతికి పాల్పడిన వారిని బయపెట్టో, బతిమిలాడో వారు వాడుకున్న డబ్బును వాయిదాల రూపంలో చెల్లించుకుంటున్నారు.

సభ్యుల అప్రమత్తత ముఖ్యం

ఎన్ని వ్యక్తిగత పాస్‌బుక్‌లు పెట్టిన సంఘం యొక్క సభ్యులు ఎల్లప్పుడు అప్రమత్తంగా ఉండి, తప్పనిసరిగా సంఘంలోని సభ్యురాలే వ్యక్తిగత పాస్‌బుక్‌లను, సంఘానికి సంబంధించి రికార్డులను రాసుకోగలిగి, ప్రతినెలా సంఘం సమావేశంలో రుణాలు, పొదుపులపై సభ్యులు చర్చించుకుంటే అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చన్నది అధికారుల మాట. దీనిపై మండల, జిల్లా స్థాయిలో అధికారులు అవగాహన కార్యక్రమాలు చాలానే నిర్వహిస్తున్నారు. కాగా మండల, జిల్లా అధికారులు సైతం ప్రతీనెలా సంఘాలను సందర్శించి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ సంఘం సభ్యులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే ఈ అవినీతికి అడ్డకట్ట వేయవచ్చు అన్నది ప్రజాప్రతినిధులు, విద్యావంతుల సూచన.

ప్రతీ సభ్యురాలికి వ్యక్తిగత పాస్‌బుక్ ఏర్పాటు

● శ్రీనివాస్, ఏపీఎం భిక్కనూరు

ప్రతీ సభ్యురాలికి వ్యక్తిగత పాస్‌బుక్‌ను ఏర్పాటు చేశాం. ఈ పాస్‌బుక్‌లో సభ్యురాలికి సంబంధించిన పొదుపు వివరాలు, రుణాలకు సంబంధించిన వివరాలు, వాయిదాలు చెల్లించాల్సినవి, చెల్లించినవి ఇలాంటి పూర్తి వివరాలను నమోదు చేయడం జరుగుతోంది. గ్రామ సంఘాల్లో, ఎస్‌హెచ్‌జీలో అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ఉన్నతాధికారుల సూచనలు ఎప్పటికప్పుడు పాటిస్తున్నాం. ఇది వరకు సంఘం సభ్యుల డబ్బులను వాడుకుని అవినీతికి పాల్పడిన వారి నుంచి రికవరీ చేస్తున్నాం. ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న వీవోఏలు, సీసీలపై ప్రత్యేక దృష్టి సారించాం. ఏవైనా సమస్యలుంటే సభ్యులు తమ దృష్టికి తీసుకురావాలి.



ఉత్తమ ఏడీఈగా ఎంపికైన సుహాసినిని అభినందిస్తున్న డీఈ, ఇతర ట్రాన్స్‌కో సిబ్బంది

ఉత్తమ ఏడీఈగా సుహాసిని ఎంపిక

నవీపేట,మే17: విద్యుత్ శాఖలో పని చేస్తున్న నవీపేట ఏడీఈ సుహాసిని ద్వితీయ ఉత్తమ ఏడీఈగా ఎంపిక కావడం పట్ల శుక్రవారం ఆమెను పలువురు సిబ్బంది అభినందించారు. ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రాంతంలో ఉత్తమ పనితీరు కనబర్చిన నవీపేట ఏడీఈ సుహాసిని సంస్థ పరిధిలో ద్వితీయ స్థానంలో ఎంపికైనట్లు ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కే.వరుణ్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రకటించారు. అలాగే నవీపేట ఏఈగా పని చేస్తున్న ప్రవీణ్ కుమార్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో ఎంపికైనట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా ఏడీఈ సుహాసిని, ఏఈ ప్రవీణ్ కుమార్‌లను శుక్రవారం మండల కేంద్రంలో ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జన్నేపల్లి ఏఈ శ్రీనివాస్, లైన్ ఇన్స్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, ఈఆర్‌వో కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

నీటి సమస్యకు పరిష్కారం!!

మోస్రా, మే 17: మండలంలోని చే నెంబర్ తండా దుబ్బలో గత కొన్ని రోజులుగా గ్రామ ప్రజలు నీటి సమస్య ఉన్నదని గ్రామ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సమస్య పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ ప్రకారం రెండు బోర్లు వేయించి రెండు వన్ హెచ్‌పీ మోటార్లు ఇప్పించి తమ గ్రామ నీటి సమస్యను పరిష్కారం చేశారని గ్రామ అధ్యక్షుడు రత్నవత్ వీరన్న తెలిపారు.

అధ్వానంగా కొలిప్యాక్ బీటీ రోడ్డు



చెడిపోయిన బీటీ రోడ్డు



చెడిపోయిన రోడ్డుపై కంకర తేలి గుంతలు పడ్డ దృశ్యం

● రోడ్డుపై కంకరతేలి భారీ గుంతలు


జక్రాన్‌పల్లి, మే 17: గ్రామీణ ప్రాంతాలకు వెళ్ళితే చెడిపోయిన బీటీ రోడ్లను మరమ్మతు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గ్రామాలకు వెళ్లే రోడ్డు చెడిపోయి అధ్వానంగా మారి వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు చెడిపోయి అధ్వానంగా మారింది. మనోహరాబాద్ సాయిబాబా ఆశ్రమం, కొలిప్యాక్ గ్రామం నుంచి ఎక్స్‌రోడ్డు వరకు కొన్నేళ్ల నుంచి బీటీరోడ్డు చెడిపోయింది. రోడ్డుపై వెళ్లాలంటే ఇరువైపు వెళ్లే వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కొలిప్యాక్ గ్రామానికి వెళ్ళే బీటీరోడ్డు చెడిపోయి కంకర తేలి భారీ గుంతలు పడ్డాయి. దీంతో ప్రజలు రోడ్డు వెంట వెళ్లాలంటే నానా తంటాలుపడుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొలిప్యాక్ గ్రామానికి వెళ్లే రోడ్డు బీటీరోడ్డు చెడిపోగా మరమ్మతుకు నిధుల మంజూరు కోసం రూ.3కోట్లతో అప్పటి రూరల్ ఎమ్మెల్యే, ఆర్టీసీ ఛైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ ప్రతిపాదనలు పంపారు. అయినా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.

● వర్షా కాలం.. ప్రమాదాలకు ఆస్కారం!!

రానున్న వర్షాకాలం కావడంతో బీటీరోడ్డు చెడిపోయి కంకరతేలి రోడ్డుపై గుంతలు పడడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ చెడిపోయిన బీటీరోడ్డు మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించి మరమ్మత్తు పనులు చేయించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నప్పటికీ పట్టించుకోలేదని ఆగ్రమస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికై సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి చెడిపోయిన కొలిప్యాక్ బీటీరోడ్డు మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయించి పనులు పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బీటీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

: కుంట చిన్న నర్సయ్య, కొలిప్యాక్



మండలంలోని కొలిప్యాక్ గ్రామం బీటీ రోడ్డు చెడిపోయి అధ్వానంగా మరింది. ఈ రోడ్డు వెంట వెళ్ళాలంటే గ్రామస్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలం అయినందున చెడిపోయిన బీటీరోడ్డు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి. ఈ రోడ్డు వెంట వెళ్లే వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని కోరుతున్నాం.

బీటీ రోడ్డు మరమ్మతు పనుల కోసం రూ.3కోట్లతో ప్రతిపాదనలు పంపుతాం

: ప్రవీన్, ఆర్‌అండ్‌బీ ఏఈ, జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ గ్రామానికి వెళ్లే బీటీరోడ్డు చెడిపోయింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ద్వారా బీటీరోడ్డు మరమ్మత్తు పనుల కోసం రూ.3కోట్లతో ప్రభుత్వంకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరైన వెంటనే టెండర్‌లు కాగానే చెడిపోయిన కొలిప్యాక్ బీటీరోడ్డు మరమ్మత్తులను చేపడతాం.

ఆరు గ్యారంటీలు కాదు, ప్రభుత్వామే గ్యారంటీ లేదు

● ఇచ్చిన హామీల అమలులో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలం ● వరికి రూ.500 బోనస్ ఇవ్వాల్సిందే.. ● రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి



నివాళ్లు అర్పిస్తున్న రూరల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి, మే 17: అబ్బదపు హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్నరని ఇచ్చిన హామీలు నేరవేర్చే వరకు ప్రభుత్వాన్ని వదిలేది లేదని బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలో తల్లి తెలంగాణ విగ్రహం వద్ద శుక్రవారం పూలతో విగ్రహానికి నివాళ్లు అర్పించిన అనంతరం ధర్నా చౌక్ లో నిర్వహించిన ధర్నాలో బాజిరెడ్డి గోవర్ధన్ ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సిగ్గు చేటు అన్నారు. ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రస్తుతం గ్యారంటీ లేదని, ప్రజలు విశ్వసించడం లేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని, బాజిరెడ్డి హెచ్చరించారు. డిసెంబరు 9నే రైతు రుణామాఫీ చేస్తానని చెప్పి తప్పించుకొని కల్లిబొల్లి మాటలతో కాలం వెల్లదీస్తున్నరన్నారు. గ్రామాల్లో బీఆర్‌ఎస్ కార్యకర్తలను కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు వేదించి ఇబ్బందులకు గురి చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని, అవసరమైతే పోలీస్ స్టేషన్‌ల ఎదుట ధర్నాలు చేసి కార్యకర్తలను కాపాడుకుంటానని తెలిపారు. ప్రజలకు, రైతాంగానికి అండగా ఉండేది బీఆర్‌ఎస్ మాత్రమేనని, ఆగస్టు 15లోగా రైతు రుణా మాఫీ చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్న ఏ సంవత్సరం ఆగస్టు నెలలో చేస్తారో మాత్రం చెప్పడము లేదని విమర్శించారు. తాను ఎంపీగా గెలిస్తే జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆర్టీసీ సంస్థ ఇప్పటికే పీకాల్లోతు అప్పులో ఉందని, 1400 బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదన్నారు. రైతులను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డిని రైతులే రబ్బరు చెప్పులతో కొడుతారని ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ ఘాటు విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్ బాజిరెడ్డి, ఇందల్వాయి ఎంపీపీ రమేశ్ నాయక్, నియోజకవర్గంలోని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మహిపాల్ యాదవ్, మొచ్చ శ్రీనివాస్,చిలివేరి గంగాదాస్, మదుకర్ రావు, నారాబోయిన శ్రీనివాస్, కుంచాల రాజు, తొర్లికొండ రాజు, హన్మంత్‌రెడ్డి, శక్కరి కొండ కృష్ణ, ఒడ్డం నర్సయ్య, రామడుగు మహేందర్, తిరుమల్, అజయ్, పద్మరావు, గీత, లక్ష్మీ, బుచ్చమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

రెంజల్, మే 17: ఎండలు తీవ్రతరమవ్వడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి దృష్ట్యా ఎండలు తీవ్రతరమవ్వడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూసి పారిశుధ్యంపై దృష్టి సారించాలని అన్నారు. తాగునీటి పైపులైన్ మరమ్మతుల కోసం ప్రణాళికబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి పంచాయతీ పరిధిలో వందశాతం పన్నులు వసూలు చేసి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ గౌస్, ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ డీఈ మున్ని నాయక్, ఏఈ గబ్బర్ సింగ్, పంచాయతీ కార్యదర్శులు రాఘవేంద్ర గౌడ్, రాజేందర్, సాయిలు, సునీల్, రజని, రాణి, సాయిబాబా, రాజు, నవీన్, శ్రీకాంత్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

బోధన్ డివిజన్ అధికారుల సమాచారం

ఆర్డీవో	9491036893
బోధన్ ఏసీపీ	8712659809
బోధన్ మున్సిపల్ ఛైర్‌పర్సన్	8555939494
మున్సిపల్ కమిషనర్	6305249776
తహసీల్దార్	9491036917
రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్	9397970606
శానిటరీ ఇన్స్‌స్పెక్టర్	9676846754
వాతావరణ శాఖ బోధన్	9885865423
ఎక్సైజ్ శాఖ సీఐ	8712658975
పట్టణ సీఐ	8712659870
రూరల్ సీఐ	8712659871
ఐసీడీఎస్ సీడీపీవో	6303829709
ఆర్టీసీ డిపో మేనేజర్	9959226001
ఆర్టీసీ ఎంక్వైరీ	9848500725
రైల్వే స్టేషన్	9491104601
ప్రభుత్వ జూనియర్ కళాశాల	9959951061
మధుమలంచ జూ. కళాశాల	9182389186
ప్రభుత్వ డిగ్రీ కళాశాల	9494027975
వ్యవసాయ శాఖ	7288894588
ఎంపీడీవో	9849900110

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిపేట, మే 17: నందిపేట, మక్లూర్ మండలాల పరిధిలో ఉన్న 33/11కేవి సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని నందిపేట డివిజన్ ట్రాన్స్‌కో ఏడీ ఎం.అశోక్ తెలిపారు. అలాగే నిజామాబాద్ రూరల్ మండలం జన్నేపల్లి సబ్ స్టేషన్ పరిధిలో సైతం కరెంటు సరఫరా ఉండదన్నారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ చెప్పారు. దీనికి నందిపేట, మాక్లూర్ మండలాల పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈ ఎం అశోక్ కోరారు.

బాధిత కుటుంబానికి చెక్కు అందజేత

కోటగిరి, మే 17: పొతంగల్ మండలంలోని హంగర్గ ఫారం గ్రామానికి చెందిన సమత బాయికి శుక్రవారం మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తన స్వగృహంలో 2లక్షల సభ్యత్వ భీమా చెక్కును పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త దిలీప్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. పార్టీ సభ్యత్వం తీసుకోవడంతో బాధిత కుటుంబానికి 2లక్షల రూపాయల చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ అధ్యక్షులు ఏజాజ్ ఖాన్, మాజీ సర్పంచ్ గౌతం, నాయకులు సూరా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం

సమ్మర్ స్పెషల్

ఆహ్లాదాన్ని పంచుతున్న వాటర్ పార్క్

● ఫ్యామిలీ టూర్ జోన్‌గా సుభాష్ గార్డెన్ ● ఆకట్టుకుంటున్న వాటర్ గేమ్స్ ● సామాన్యులకు అందుబాటులో వాటర్ గేమ్స్‌జోన్

నిజామాబాద్ అర్బన్, మే 17: వేసవి వచ్చిందంటే చాలు కుటుంబంతో కలిసి సేద తీరాలని ప్రతీ సామాన్యుడు కోరుకుంటాడు. నిత్యం పనుల్లో అలసిపోయి కొన్ని రోజులు కుటుంబంతో కలిసి విహార యాత్రలకు వెళ్తుంటారు. కానీ విహార యాత్రలకు వెళ్లాలన్న, ఇతర చల్లటి ప్రదేశాలకు కుటుంబంతో కలిసి వెళ్లాలన్న ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ప్రతి ఒక్కరు వెనకడుగు వేస్తుంటారు. కానీ మనకు అందుబాటులో ఉన్న ఆనందాల్లోనే గడపాలనుకునే సామాన్యులకు నగర శివారులోని మదన్‌పల్లిలోగల సుభాష్‌గార్డెన్ ఆహ్లాదానికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. చుట్టూ కొండలు, పొలాల మధ్య పూర్తిగా గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా సుభాష్‌గార్డెన్‌లో ఏర్పాటు చేసిన అమ్యూజ్‌మెంట్ పార్క్ (వాటర్ పార్క్) అందరిని ఆకట్టుకుంటుంది. ఇదివరకు హైదరాబాద్ లాంటి పెద్ద పెద్ద నగరాలకు పరిమితమైన వాటర్ గేమ్స్ జోన్ సామాన్యులకు అందుబాటులోకి ఉండేలా మాక్లూర్ మండలం మదన్‌పల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేశారు. పాఠశాల


వాటర్ పార్క్‌లో కేరింతలు కొడుతున్న చిన్నారులు


పార్క్‌లో సరదాగా గడుపుతున్న చిన్నారులు (ఫైల్)


నిజామాబాద్ నగర శివారులోని మదన్‌పల్లిలో గల సుభాష్ గార్డెన్(వాటర్ పార్క్)

పిల్లలకే కాకుండా ఫ్యామిలీతో కలిసి ఒకరోజు ఎంజాయ్ చేయాలనుకునే వారికి ఈ వాటర్ గేమ్స్ జోన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. నిజామాబాద్ నగరానికి చెందిన కేసరి శ్రీనివాస్‌రెడ్డి 2003లో ఈ ఆగ్రో టూరిజం పార్క్‌ను ఏర్పాటు చేశారు. వాటర్ పార్క్ కాకుండా మామిడి, మలబార్, వేపచెట్లు, సపోటా చెట్లు ఈ పార్కులో ఉన్నాయి. మొత్తం 45 ఎకరాల్లో ఈ ఆగ్రో టూరిజం పార్క్ ఉంది. కుటుంబంతో కలిసి సరదాగా గడిపేందుకు ఈ పార్క్ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. పాఠశాలలు కొనసాగే సమయంలో అనేక మంది పాఠశాలల విద్యార్థులు ఈ పార్కును సందర్శించడం జరిగింది. వేసవిలో వాటర్ గేమ్స్‌ను ఎంజాయ్ చేయాలనుకునే వారికి ఈ పార్క్ అందుబాటులో ఉంది. ఇందులో వాటర్ స్లైడ్స్, డ్రైట్స్, టవర్ స్లైడ్స్, ఫ్యామిలీ ప్లే స్టేషన్, మల్టీలైన్ రైసర్ స్లైడ్స్ ఏర్పాటు చేశారు. చిన్నారులకు వివిధ గేమ్స్ ఆడుకునేందుకు పార్కుతో పాటు ప్లే జోన్స్‌ను ఏర్పాటు చేశారు. ఫ్యామిలీతో కలిసి పిక్‌నిక్ వెళ్లేందుకు పిల్లలు ఎంజాయ్ చేసేందుకు ఆహ్లాదకరమైన వాతావరణంలో జిల్లాతో పాటు ఆదిలాబాద్, కరీంనగర్, మహారాష్ట్రలోని అనేక మందికి ఈ పార్క్ అందుబాటులో ఉంది.

'వైద్యులు సమన్వయంతో మెరుగైన వైద్య సేవలు అందించాలి'

బోధన్ రూరల్, మే 17: వైద్యులు సమన్వయంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శివశంకర్ అన్నారు. శుక్రవారం బోధన్ ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాల ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని అన్నారు. ఇబ్బందులు ఏమైన ఉంటే తమకు తెలియజేయాలన్నారు. చిన్న పిల్లలకు టీకాలను సకాలంలో వేయాలని, పిల్లల్లో సమస్యలు కనిపించినట్లయితే వైద్యులకు చూయించాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ప్రేమతో మాట్లాడుతూ వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలను వైద్యులు తప్పకుండా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ రాహుల్, ఆర్ఎంఓ డాక్టర్ అబ్దుల్ రహీం, డాక్టర్ సందీప్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిజాయతీ గల వారిని వర్సిటీకి వీసీగా నియామించాలి : పీడీఎస్‌యూ

డిచ్‌పల్లి, మే 17: తెలంగాణ విశ్వవిద్యాలయానికి నిజాయతీగల వారిని ప్రభుత్వం వీసీగా నియామించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయంలో అన్ని యూనివర్సిటీలను భ్రష్టుపట్టించారని, మాజీ సీఎం యూనివర్సిటీలను విధ్వంసం చేశారని వర్సిటీలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు. గత కాంగ్రెస్ హయంలో ఏర్పాటు అయిన తెలంగాణ విశ్వవిద్యాలయంకు రూ.వంద కోట్ల నిధు లు మంజూరు చేయాలని, వర్సిటీ అభివృద్ధి దోహదవ చేస్తు , నిజాయితీ గల వీసీ, రిజిస్ట్రార్‌లను నియామించాలని డిమాండ్ చేశారు. గతంలో పాలక మండలి తీసుకున్న నిర్ణయాలను అమలు చేయాలేదని అవినీతి వీసీ లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డ వర్సిటీ ప్రక్షాలన జరగ లేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. వర్సిటీలపై ప్రభుత్వం చిత్త శుద్ధి చూపాలని అడ్మినిస్ట్రేషన్, పరిశోధనలపై నైపుణ్యాత గల వారిని వీసీలుగా నియామించలన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో పీడీఎస్‌యూ నాయకులు రవీందర్, వంశీ, గోపి, రాజు, పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోటగిరి, మే17: కోటగిరి మండలంలో శనివారం మధ్యాహ్నం 3గంటల నుండి 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా కోటగిరి, కొత్తపల్లి సబ్ స్టేషన్ పరిధిలో గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

..వేంకటేశ్వర స్వామి కల్యాణం

రుద్రూరు, మే 17: మండల కేంద్రంలోని అక్బర్‌నగర్ గ్రామంలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలను శనివారం కన్నుల పండుగగా నిర్వహించడం జరుగుతుందని ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధనా కేంద్రం అధిపతి బాలాజీనాయక్ తెలిపారు. ఉదయం 10.35 గంటలకు శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వారి కళ్యాణాన్ని బ్రహ్మశ్రీ శ్రీనివాస్ శర్మ, విష్ణుశర్మ, రోహిత్ శర్మ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య కళ్యాణం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు. అదే విధంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

'అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తులు'

మెండోర, మే17: మండలంలో పోచంపాడ్ తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల కళాశాల పోచంపాడ్‌లో 2024-25వ సంవత్సరంనకు 5వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధించేందుకు విద్యార్హతలు అనుభవం కలిగిన అతిథి ఉపాధ్యాయులు విద్యార్హతలు అనుభవ సర్టిఫికెట్లు జతచేసి 30వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తారాసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ, ఆంగ్లం, గణితం, సామాన్యశాస్త్రం బౌతికశాస్త్రం రసాయనిక శాస్త్రం వృక్షశాస్త్రం జంతు శాస్త్రం నర్సింగ్ ఆఫీసర్ సబ్జెక్టుల్లో డిగ్రీ బీఈడీ, బీఎస్సీ నర్సింగ్ చేసిన వారు అర్హులని మరిన్ని వివరాలకు 9866559693నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

'లోవోల్టేజీ సమస్య పరిష్కరించాలి'

పెర్కిట్, మే17: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో 7వార్డు తిరుమల కాలనీవాసులు లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని శుక్రవారం ట్రాన్స్‌కో ఏఈ బాస్కరప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగిల్‌ఫేజ్ ఉండడం వల్ల లోవోల్టేజ్ సమస్య తలెత్తుతుందని, త్రీఫెజ్‌కు మార్పులు చేసినట్లతే సమస్య పరిష్కరమవుతుందని, వెంటనే ఏడీకి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలకాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు మధుసూదన్, ఖాందేశ్ ప్రశాంత్, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ట్రాన్స్‌కో ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న తిరుమల కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు, కాలనీవాసులు

డిగ్రీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి


పాల్గొన్న పరీక్ష కేంద్రాల సూపరిండెంట్‌లు, ప్రిన్సిపాళ్లు

● తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి

డిచ్‌పల్లి, మే 17: ఈ నెల 21 నుంచి జూన్ 15 వరకు ఉమ్మడి జిల్లాలో 38పరీక్ష కేంద్రాల్లో డిగ్రీ పరీక్షలు నిర్వహించేందుకు పకడ్బంది ఏర్పాట్లు చేసినట్లు టీయూ రిజిస్ట్రార్ ప్రొ.యాదగిరి తెలిపారు. శుక్రవారం వర్సిటీలో పలు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరిండెంట్, ఆడిట్‌సెల్ అధికారులతో జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ హాజరై మాట్లాడారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరిండెంట్ గా విధులు నిర్వహించే వారు పేపర్ డౌన్ లోడ్ చేసే సమయానికి విధిగా పరీక్ష కేంద్రంలో ఉండాలని ఆదేశించారు. చీఫ్ సూపరిండెంట్ లకు అనివార్యమైన పనులు ఉంటే విధిగా అక్కడ ఉన్న మరో అధికారికి లిఖిత పూర్వకంగా బాధ్యతలు అప్పగించాలన్నారు. ఈ విషయం ఆడిట్ సెల్ లేదా, పరీక్షల విభాగం అధికారులకు సమాచారం చేరవేయలన్నారు విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదని హెచ్చరించారు. 2,4,6 సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలకు దాదాపు 24వేల మంది విద్యార్థులు, 1,3,5 సెమిస్టర్ బ్యాక్ లగ్ పరీక్షలకు 14వేల మంది పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఏలాంటి లోసుగులు లేకుండా పరీక్షల ఏర్పాట్లు చేసినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. పేపర్ డౌన్‌లోడ్ సమయంలో వర్సిటీ నియామించిన అబ్జర్వర్‌తో పాటు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరిండెంట్ తప్పక ఉండలన్నారు. ఈ సారి ప్రత్యేక స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో ఇన్విజిలేటర్‌లు ఫోన్ లను ఉపయోగించవద్దన్నారు. ఈ సమావేశంపై ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికి కొంత మంది ప్రిన్సిపాళ్లు మరీ ముఖ్యమంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఏలాంటి సమాచారం ఇవ్వకుండా గైర్హాజరవడం పట్ల రిజిస్ట్రార్ అసహానం వ్యక్తం చేశారు. ఆయా ప్రిన్సిపాళ్ల నుంచి గైర్హాజరు విషయం వివరణ కోరాలని ఆడిట్ సెల్ అధికారులకు రిజిస్ట్రార్ ఆదేశించారు. ఈ సమావేశంలో పరీక్షల నియంత్రణాధికారి ప్రొ.అరుణ, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంట చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన గోరీ, పలు కళాశాలల సూపరిండెంట్ పాల్గొన్నారు.

● ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల తీరుపై విమర్శలు

తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్ల వైఖరి తీవ్రమైన విమర్శలకు దారి తీస్తుంది. వర్సిటీ ఉన్నతాధికారుల ఆదేశాల పాటించకుండా ఇష్టనుసారంగా వ్యవహరిస్తున్నరని ప్రచారం సాగుతుంది. ఇందుకు ఊదహర ఇటీవల వార్షిక తనిఖీల్లో భాగంగా తెలంగాణ వర్సిటీ ఆడిట్ సెల్ అధికారులు ఎల్లారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి తనిఖీలకు వెళ్లిన అక్కడ ప్రిన్సిపాల్ గైర్హాజరం విమర్శలు వచ్చాయి. ఈవిషయంలో ప్రిన్సిపాల్ ను తెలంగాణ వర్సిటీ అధికారులు వివరణ కోరిన పట్టించుకోలేదని తెలుస్తుంది. ఇది జరిగిన 15 రోజుల్లోనే వర్సిటీలో శుక్రవారం రిజిస్ట్రార్ అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు గైర్హాజరవడం గమనార్హం.


హసాకొత్తూర్‌లో పనుల వివరాలను తెలుసుకుంటున్న అంకిత్


బషీరాబాద్‌లో పాఠశాల గదులను పరిశీలిస్తూ..

నెలాఖరులోగా అన్ని పాఠశాల్లో..

వంద శాతం పనులు పూర్తి చేయాలి

● అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు

కమ్మర్‌పల్లి, మే 17: రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శపాఠశాల్లో మంజూరి ఇచ్చన అభివృద్ధి పనులు నెలలోపు పూర్తి చేయించాలని జిల్లా లోకల్‌బాడి అదనపు కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. శుక్రవారం మండంలలోని అమ్మ ఆదర్శపాఠశాలలుగా ఎంపికైన హసాకొత్తూర్, బషీరాబాద్ ఉన్నత ప్రామిక పాఠశాల్లో విద్యుదీకరణ, తదితర అభివృద్ధి పనులను ఆయన సందర్శించి సరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పించాలన్నదే రాష్ట్ర గ్రభుత్వ లక్ష్యమన్నారు. ఇందునిమిత్తం మంజూరైన పనులు నెలలోపు ప్రతి పాశాలలో వందశాతం పనులు పూర్తి అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని అదేశించారు. అభివృద్ధి పనేఉలపట్ల ప్రత్యేక దృష్టసారించాలని, పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యేలోపు జూన్ 12 వరకు ప్రభుత్వం మహిళ సంఘాలకు అప్పగించిన ఏకరూపదుస్తుల తయారి పూర్తి కావాలని మహిళ సంఘాలనుద్దేశించి అన్నారు. అనంతరం మండలంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. వందశాతం పనులన్ని ఈ నెలాఖరులోఎగా కాగా మండలంలోని అమ్మ ఆదర్శపాఠశాలలు 18కి గాను 17 పాఠశాల్లో పనులు ప్రారంభమైనట్లు ఎంపీడీవో రాజా శ్రీనివాస్ అడిషనల్ కలెక్టర్‌కు వివరించారు. ఆయనవెంట ఎంపీడీవో రాజ శ్రీనివాస్, తహసీల్దార్ ఎం ఆంనేయులు, ఏఈ పీఆర్ శ్రీనివాసులు, ఎంపీవోసదాశివ్, ఏపీఎం కుంట గంగారెడ్డి, సిసిలు నవీన్, భాగ్యలక్ష్మీ, పంచాయితి కార్యదర్శులు నర్సయ్య, అమ్మఆదర్శ పాఠశాలల కమిటి సభ్యులు పాల్గొన్నారు.


విద్యార్థి సాయిస్వాగత్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఫైరింగ్ కాంపిటీషన్‌లో విద్యార్థి ప్రతిభ

ఆర్మూర్ రూరల్, మే 17: ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలో క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ కెడెట్ కర్ధం సాయి స్వాగత్ ఫైరింగ్ కాంపిటీషన్‌లో ప్రతిభ చూపినట్లు కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ తెలిపారు. ఇటీవల జరిగిన బెటాలియన్ లెవల్‌లో, గ్రూప్ లెవల్‌లో ప్రతిభ చూపి ఫైరింగ్ కాంపిటిషన్‌కు ఎంపికయ్యారని తెలిపారు. కాకినాడలో జరిగిన జాతీయస్థాయి క్యాంప్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆయన తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థి సాయిస్వాగత్‌ను కళాశాల యాజమాన్యం అల్జాపూర్ గంగాధర్, ప్రిన్సిపాల్ ఆర్‌కె.పాండే, వైస్‌ప్రిన్సిపాల్ నరేందర్ అభినందించారు.

'ప్రభుత్వ కళాశాలల్లో చేరాలి'

ఆర్మూర్ రూరల్, మే 17: ప్రభుత్వ జునియర్ కళాశాలల్లో పదవ తరగతి పూర్తయిన వారు చేరాలని ప్రిన్సిపాల్, అధ్యాపకులు శుక్రవారం ఆర్మూర్ పట్టణంలో వివిధ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను జునియర్ కళాశాలలో అడ్మిషన్‌ల కోసం ఇటీవల పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తమ కళాశాలలో చేరాలని, ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను వారికి వివరించారు. ఇంటర్‌లో ఫెయిలైన విద్యార్థులకు 24 నుంచి జరగనున్న అడ్మిన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కనక మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ దేవరాం తెలిపారు. ఇందులో అధ్యాపకులు వెంకటేష్, నవీన్, సవతి, తదితరులున్నారు.

'స్పోర్ట్స్ కోటలో బ్యాంకులో ఉద్యోగాలు'

ముప్కాల్, మే 17: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో స్పోర్ట్స్ కోటలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి అంద్యాల లింగయ్య, కె.గంగాధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాస్థాయి క్రీడాకారులు 24తేదీ ఉదయం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, స్పోర్ట్స్ కోట పొందిన ధృవపత్రం వయస్సు ధృవపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎత్తిపోతల చైర్మన్‌ల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

డొంకేశ్వర్, మే 17: ఉమ్మడి మండలాల ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డొంకేశ్వర్ మండలంలోని నూత్‌పల్లిలో గ్రామంలో చైర్మన్ సమావేశమై ఏకగ్రీవంగా మండల అధ్యక్షునిగా మారంపల్లి లిఫ్ట్‌చైర్మన్‌గా మోర్తాడ్ బోజారెడ్డి, ఉపాధ్యక్షునిగా దత్తాపూర్ లిఫ్ట్ చైర్మన్ సుంకరి రాజు, కార్యదర్శిగా ఓంకార్‌లను ఏన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మోర్తాడ్ బోజారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతీ ఎకరానికి నీరు అందించేందుకు కృషి చేస్తానని అన్నారు. లిఫ్టల సమస్యల ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు నిరంతరం పని చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లిఫ్ట్ చైర్మన్ జిల్కర చిన్నయ్య, రమేష్, గంగారెడ్డి, నర్సారెడ్డి, రాజేశ్వర్, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


ఏకగ్రీవంగా ఎన్నికైన ఎత్తిపోతల కమిటీ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

మొక్కల సంరక్షణ గాలికేనా?

● నా దృష్టికి రాలేదు : డీఎల్‌పీవో సాయిబాబా

మోస్రా, మే 17: మోస్రా మండలాన్ని అభివృద్ధిలో ఉంచాలనే ఉద్దేశంతో నిజామాబాద్, బాన్సువాడ ప్రధాన రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా ఏర్పాటు చేయగా మండల కేంద్రం అందంగా కనబడాలనే ఆలోచనతో భాగంగా రోడ్డుకు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అదే విధంగా గ్రామంలో పచ్చగా కనబడే విధంగా గ్రామ పంచాయతీ నిధుల నుండి 1250రూపాయలు విలువ గల మిర్చిమేరీ గ్రీన్ రకం చెట్లను రోడ్డు డివైడర్‌లో నాటారు. ఈ చెట్లలో దాదాపు 90చెట్లు పూర్తిగా ధ్వంసం కాగా మరికొన్ని చెట్లు నీరుపోయాక, మరికొన్ని సరిగ్గా తవ్వక ఎండిపోతున్నాయి. ఇట్టి విషయంపై ఆరా తీయడం సంగతి దేవుడెరుగు. కనీసం పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఇట్టి విషయంపై డీఎల్‌పీవో సాయిబాబాను వివరణ కోరగా.. నాకు ఇట్టి విషయంపై ఏమీ తెలియదని పత్రికలో రాసిన తర్వాత మా దృష్టికి వస్తే విచారణకు వస్తానని తెలిపారు.







1) మోస్రా మండలకేంద్రంలో ఎండిపోయిన మొక్కలు
2) నిజామాబాద్-బాన్సువాడ రోడ్డు డివైడర్ మధ్యలో మొక్కలు
3) మొక్కను మేస్తున్న పశువులు



బాన్సువాడ శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

ధ్రువ పత్రాలు లేకుండా వాహనాన్ని నడపొద్దు

● బాన్సువాడ ఎస్సై జగన్నాథం

బాన్సువాడ, మే 17: వాహనానికి సంబంధించిన సరైన ధ్రువ పత్రాలు లేనియెడల వాహనాన్ని నడపరాదని బాన్సువాడ ఎస్సై జగన్నాథం అన్నారు. శుక్రవారం బాన్సువాడ పట్టణ శివారులో వాహనాలను తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులకు హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహనదారునికి పెండింగ్‌లో ఉన్న చలాన్ వాహనాలకు జరిమానాలు విధించారు. ప్రతి ఒక్కరూ ధ్రువపత్రాలు లేకుండా బయటకు రావద్దని వాహనాన్ని నడపరాదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ హరిప్రసాద్, మొయిన్ తదితరులు ఉన్నారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు
విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం



తిమ్మాపూర్‌లో రికార్డులను తనిఖీ చేస్తున్న ఏవో కమల

బీర్కూర్, మే 17: నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ శాఖ అధికారిణి కమల హెచ్చరించారు. శుక్రవారం ఆమె బీర్కూర్, తిమ్మాపూర్, బరంగేడ్గి గ్రామాల్లో పర్యటించి ఎరువులు, పురుగుల మందులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. రైతులు ఖరీఫ్‌కు సిద్ధం అవుతున్న నేపథ్యంలో ఎరువులు అందుబాటులో ఉంచామని అన్నారు. ఎరువుల దుకాణాలు తనిఖీ చేసే క్రమంలో ఈ పాస్, గ్రౌండ్ స్టాక్ ఎంత మేరా ఉందనే వివరాలను తెలుసుకున్నారు. విత్తన విక్రయ షాపుల్లో విత్తనాల శాంపిళ్లను సేకరించారు. విత్తనాల నాణ్యత తెలుసుకునేందుకు, శాంపిళ్లను ల్యాబ్‌కు పంపనున్నట్లు ఆమె తెలిపారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గిరిజన గురుకుల కళాశాలల్లో
ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

● 23న కామారెడ్డిలో బాలురకు.. 25న చేగుంటలో బాలికలకు కౌన్సెలింగ్ ● రీజనల్ కో ఆర్డినేటర్ సంపత్‌కుమార్

ఎల్లారెడ్డి, మే 17: గిరిజన జూనియర్ కళాశాలలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్‌ల కోసం కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ఆ సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ టి.సంపత్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23న కామారెడ్డి పట్టణంలోని (సరంపల్లి క్రాస్ రోడ్డు) లో నాగిరెడ్డిపేట గిరిజన గురుకులంలో బాలురకు, మెదక్ జిల్లా చేగుంటలో గల జూనియర్ కళాశాలలో 25న బాలికలకు మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు చెందిన 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన (ఎస్టీ) వారు హాజరు కావాలని తెలిపారు. గిరిజన బాల, బాలికలు మెమో, బోనాఫైడ్, టీసీ, కుల, ఆదాయ, ఫిజికల్ ఫిట్‌నెస్, ధ్రువ పత్రాలు తీసుకుని కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్ ప్రథమ సంవత్సరంలో మిగిలిన ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. గిరిజన గురుకులంలో చదివిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర కులాల వారికి పరిమితి సంఖ్యలో ఖాళీలు ఉన్నాయన్నారు.



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖాతాదారులకు సైబర్ క్రైంపై అవగాహన

దోమకొండ, మే 17: మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ ఖాతాదారులకు ఎస్పీ సింధూశర్మ ఆదేశాల మేరకు పోలీసులు సైబర్ క్రైం, షీం టీం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై గణేష్ మాట్లాడుతూ అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయవద్దని, గుర్తు తెలియని వ్యక్తులకు ఏటీఎం పిన్, అకౌంట్ వివరాలు, ఓటీపీలు చెప్పవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ షీంటీంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం బ్యాంకు ఆవరణలో కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై చారీ, సిబ్బంది భూమయ్య, ప్రభాకర్, సౌజన్య, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

నేడు ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం



ఎల్లారెడ్డి పురపాలక సంఘం కార్యాలయం

- మొత్తం 12 మందిలో 11 మంది కౌన్సిలర్లు క్యాంపులో
- సమావేశానికి ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- కౌన్సిలర్లు క్యాంపు నుంచి నేరుగా మున్సిపల్ కార్యాలయానికి ..

ఎల్లారెడ్డి, మే 17: శనివారం ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ పై అవిశ్వాసం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి గత నెల 24న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావుల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. అందుకు నిరసనగా అదే రోజు 11 మంది కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్‌ను కలిసి అవిశ్వాస తీర్మానం అందజేశారు. ఈనెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న మొత్తం 11మంది కౌన్సిలర్లు క్యాంప్‌కు తరలివెళ్లారు. ఎల్లారెడ్డిలో మొత్తం 12మంది కౌన్సిలర్లలో 9 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు ఉన్నారు. క్యాంప్‌లో ఉన్న 11 మంది కౌన్సిలర్లు ఒక్క తాటిపై ఉన్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్ పని తీరుపై అసంతృప్తితో ఉన్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు శిబిరాలు సైతం ఏర్పాటు చేశారు. కాని ఏడాది క్రితం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే జాజాల సురేందర్ కౌన్సిలర్లతో చర్చలు జరిపి సయోధ్య కుదుర్చడంతో అవిశ్వాస ప్రయత్నాలను కౌన్సిలర్లు విరమించుకున్నారు.

చైర్మన్‌ను గద్దె దించడమే కౌన్సిలర్ల లక్ష్యం

చైర్మన్ సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీలో చేరడంతో మున్సిపల్‌లో రాజకీయ రసవత్తరంగా మారింది. క్యాంపునకు వెళ్లిన వారిలో ఇద్దరు కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా ఉన్నారు. అందరూ ఒక్క తాటిపై ఉండి అవిశ్వాసానికి మద్దతు ఇచ్చి చైర్మన్ పీఠం మీద నుంచి గద్దె దించడమే లక్ష్యంగా ఉన్నట్లు సమాచారం.

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

● ఎంపీపీ రఘు



బీర్కూర్‌లో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రఘు

బీర్కూర్, మే 17 : వేసవి కాలం నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంటుందని, నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ రఘు అధికారులను ఆదేశించారు. శుక్రవారం బీర్కూర్ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో తాగునీటి ఎద్దడి, ఉపాధిహామీ పథకంపై ఎంపీపీ జీపీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతాయన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రతిరోజూ గ్రామాల్లోని వీధుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. సింగిల్ ఫేజ్ మోటార్లు, వాటర్ ట్యాంక్‌ల మోటార్లు పాడైతే వెంటనే మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భారతి జీపీ కార్యదర్శులకు సూచించారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశాల్లో తాగునీటి వసతి కల్పించడంతో పాటు టెంట్లు వేసి కూడా నీడ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ భానుప్రకాష్, ఎంపీవో అనిత, ఏపీవో అక్బల్, జీపీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

- ఎన్నికల కోడ్ కారణంగా అధికారులతో సమావేశం పెట్టలేకపోతున్నా
- వేరే జిల్లాల రైస్‌మిల్లులకు 40 వేల మెట్రిక్ టన్నుల కామారెడ్డి వడ్లు
- ఐదు రోజుల్లో వడ్లు అన్ని పోయేలా చర్యలు తీసుకుంటున్నాం
- కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, మే 17: కామారెడ్డి నియోజకవర్గ పరిధిలో యాసంగి వడ్ల కొనుగోలు కేంద్రాల్లో సమస్యల విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వడ్ల కొనుగోలు కేంద్రాల్లో గత పది రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రైస్‌మిల్లర్లు, సొసైటీ డైరెక్టర్‌లు, తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, కొనుగోలు ఏజెన్సీలతో సమావేశం ఏర్పాటు చేయడానికి ఎన్నికల కోడ్ దృష్ట్యా అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌కు లేటర్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ కూడా ఎన్నికల కమిషన్‌కు లెటర్ రాశారని తెలిపారు. ప్రస్తుతం ఇబ్బంది అవుతున్న దృష్ట్యా వేరే జిల్లా రైస్‌మిల్లర్‌లతో మాట్లాడి 40 వేల మెట్రిక్ టన్నుల వడ్లు తరలించేందుకు అనుమతి లభించిందని, జిల్లాలోని మిగితా రైస్‌మిల్లులు కూడా రైతులకు ఇబ్బందులు రాకుండా ఐదు రోజుల్లో వడ్లు ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారని అన్నారు. రైతులు అధైర్యపడవద్దని అండగా తాను ఉన్నానని భరోసా ఇచ్చారు.

ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

● వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

కామారెడ్డి టౌన్, మే 17: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వెంట వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. శుక్రవారం ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో ధాన్యం కొనుగోళ్లు, ధరణి దరఖాస్తులు, ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులు పాఠశాలల పునఃప్రారంభానికి ముందే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌లతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. అంతేకాకుండా లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించడంలో కలెక్టర్‌లు, ఉన్నతాధికారులు, సిబ్బంది పోషించిన పాత్రను ఆమె అభినందించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన మౌలిక వసతుల కల్పన అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని, ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రత్యేక డ్రైవ్ పునఃప్రారంభించాలని, మే చివరి నాటికి దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా 5 రోజుల పాటు అకాల వర్షాలు ఉన్నందున ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని సీఎస్ సూచించారు. రైతులకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం కలుగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి కమారెడ్డి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్‌లు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున బాబు, ఇన్‌చార్జి పౌర సరఫరాల శాఖ మేనేజర్ నిత్యానందం, డీఈవో రాజు, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, అధికారులు తదితరులు ఈ వీడియో సమావేశంలో పాల్గొన్నారు.



భిక్కనూరులో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

'రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం విడ్డూరం'

భిక్కనూరు, మే 17: అధికారంలో 10 సంవత్సరాలు ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడైనా రైతులను పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు నేడు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందని పీసీసీ కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి ఎద్దేవా చేశారు. శుక్రవారం భిక్కనూరులో వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో అకాల వర్షాలకు, ఈదురుగాలులకు పంటలు దెబ్బతింటే ఏనాడైనా పంటనష్ట పరిహారం ఇచ్చారా అని ప్రశ్నించారు. రైతులను ఆగంమాగం చేసిన ఘనత బీఆర్ఎస్‌ది అని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎన్నికల కమిషన్‌ను ఒప్పించి ఎకరాకు రూ.10వేలను రైతుల ఖాతాల్లో వేయడం జరిగిందని, ఆగష్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ రైతులను తప్పుదోవ పట్టించే కార్యక్రమాలను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గాల్‌రెడ్డి, నాయకులు లింబాద్రి, నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువ చేయూత
ఫౌండేషన్ అధ్యక్షుడిగా సాయికుమార్

బాన్సువాడ టౌన్, మే 17: యువ చేయూత ఫౌండేషన్ నూతన అధ్యక్షుడిగా సాయికుమార్‌ను నియమించినట్లు సంస్థ చైర్మన్ వినోద్‌కుమార్ తెలిపారు. విద్యార్థి విభాగంలో చురుకుగా పనిచేసిన సాయికుమార్ సేవలను గుర్తించి అధ్యక్షుడిగా నియమించినట్లు ఆయన తెలిపారు. బాన్సువాడ, పరిసర ప్రాంతాల్లో యువ చేయూత ఆధ్వర్యంలో సంఘ సేవ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని, ప్రజల నుంచి మంది ఆదరాభిమానాలు పొందుతున్నామన్నారు.

వీవోఏలు విధులు సక్రమంగా నిర్వహించాలి

సదాశివనగర్, మే 17: వీవోఏలు విధులు సక్రమంగా నిర్వహిస్తు మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయాలని డీపీఎం సుధాకర్ అన్నారు. సదాశివనగర్ మండల ఐకేపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ మహిళ సంఘాలు పొందిన రుణాలు సక్రమంగా వినియోగించుకుని ప్రతీ మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి వీవోఏల కృషి అత్యవసరమన్నారు. పుస్తక నిర్వహణ నెలవారి పొదుపులు, నెలవారి సమావేశాలు తప్పకుండా నిర్వహిస్తు మహిళల అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రాజారెడ్డి, సీసీలు ఆంజనేయులు, రాములు, లింగం, కృష్ణంజలి తదితరులు పాల్గొన్నారు.



ఐడీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డిని నిలదీస్తున్న రైతులు

ధాన్యం కొనుగోళ్ల నిర్లక్ష్యంపై రైతుల నిలదీత

బీబీపేట, మే 17: మండలంలో వరి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమై సుమారు 40 రోజులు దాటినా లారీల కొరత, హమాలీల కొరత, రైస్‌మిల్ యాజమాన్యం పూర్తిస్థాయిలో ధాన్యాన్ని అన్‌లోడ్ చేసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఐడీసీఎంఎస్ చైర్మన్ ఇంద్రాసేనారెడ్డిని రైతులు నిలదీశారు. గతంలో కరోనా సమయంలో ధాన్యాన్ని నిల్వచేయడానికి ఫంక్షన్‌హాల్‌లు, పాత సినిమాహాళ్లు తీసుకుని రైతులకు ఇబ్బందులకు గురికాకుండా చేశారని అన్నారు. ప్రస్తుతం అధికారులు, ప్రభుత్వం చైర్మన్ చొరవ తీసుకోకపోవడం వల్ల ధాన్యం ఇంకా కల్లాల్లోనే ఉండిపోయిందని అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతుల ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఇక్కడి ప్రాంత రైస్‌మిల్లుతో పాటు హన్మకొండ, మహబూబ్‌నగర్‌లాంటి జిల్లాలను సైతం ధాన్యం తరలించే రైతులు ఇబ్బందులకు గురికాకుండా చూస్తానని అన్నారు.

ధాన్యం తరలింపులో జాప్యం చేయొద్దు

ఎల్లారెడ్డి, మే 17: ధాన్యం తరలింపులో జాప్యం చేయొద్దని ఎల్లారెడ్డి తహసీల్దార్ మహేందర్‌కుమార్ సహకార సంఘం సిబ్బందికి సూచించారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి, మీసన్‌పల్లి, శబ్దల్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్లు అందజేయాలని, ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని రైతులకు తెలిపారు. లారీల కొరత లేకుండా చూడాలని లారీలు సమయానికి రాకుంటే తమ దృష్టికి తీసుకురావాలని, తరుగు అధికంగా తీస్తే చర్యలు తప్పవన్నారు. తూకం వేసిన బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని ఎల్లారెడ్డి సహకార సంఘం కార్యదర్శి విశ్వనాథంకు తెలిపారు. ఆయనతో పాటు గిర్దావర్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతి

ఎల్లారెడ్డి, మే 17: పట్టణంలో ఒక్క ఆధార్ సెంటర్‌తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మరో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని శనివారం తహసీల్దార్ మహేందర్‌కుమార్‌కు బీఎస్పీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లారెడ్డి పట్టణంలో ఒకే ఒక ఆధార్ సెంటర్ ఉండటం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలో మరో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందని అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు లింగమయ్య, సాయికుమార్, అంబేద్కర్ సంఘం నాయకులు సంజీవులు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ఎల్లారెడ్డి, మే 17 : పచ్చిరొట్టె ఎరువులు అయిన జీలుగ విత్తనాలు ఎల్లారెడ్డి మండలంలోని గండి మాసానిపేట్ సహకార సంఘం అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి అనిల్ తెలిపారు. కావాల్సిన రైతులు ఏఈవోల వద్ద పర్మిట్ తీసుకుని గండి మాసానిపేట్‌లో తీసుకోవాలని అన్నారు. 30 కిలోల బస్తా రూ.1116 ఉంటుందని, కావాల్సిన రైతులు పట్టా పాస్ బుక్ జిరాక్స్ అందజేయాలని తెలిపారు.

కుళ్లిన స్థితిలో శవం లభ్యం

కామారెడ్డి టౌన్, మే 17: మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామ శివారులో శుక్రవారం కుళ్లిన స్థితిలో గుర్తుతెలియని పురుషుడి శవం లభ్యమైందని ఎస్ఐ రాజు తెలిపారు. దాదాపు 50 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని తెలిపారు. దాదాపు వారం రోజుల కిందట చనిపోయినట్లుగా కనబడుతుందని, గుర్తుపట్టడానికి ఆనవాళ్లుగా మెడలో చిన్న తాయత్తు, నల్లటి దారంతో ఉందని, కుడిచేతికి రాగి ఉంగరం ఉందని తెలిపారు. ఎవరైన మిస్సింగ్ అయిన లేదా ఈ ఆనవాళ్లతో గుర్తు పట్టినట్లయితే దేవునిపల్లి ఎస్ఐ 8712686150కు సంప్రదించాలని తెలిపారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

రాజంపేట, మే 17: మండలంలోని ఆర్గొండ గ్రామంలో గురువారం రాత్రి ఉరి వేసుకుని ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సంపత్ తెలిపారు. గ్రామానికి చెందిన చాకలి సిద్ధ రాములు వృత్తిరీత్యా డ్రైవర్‌గా కొనసాగుతున్నాడు. ఈనెల 12న ఆర్గొండ గ్రామ శివారులో అర్ధరాత్రి కాలకృత్యాల కోసం వచ్చిన కుమ్మరి సత్తవ్వను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ఈ ప్రమాదానికి చాకలి సిద్ధరాములే కారణమై ఉంటాడని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆయనపై అనుమానం వ్యక్తం చేసి, అందుకు పరిహారం చెల్లించాలని ఒత్తిడి చేశారు. దీంతో గత నాలుగు రోజులుగా మదనపడుతున్న సిద్ధరాములు గురువారం రాత్రి మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఈ మృతికి కారణమయ్యారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుస్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

మద్నూర్, మే 17: ఎటువంటి అనుమతి లేకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. డోంగ్లీ మండలం కుర్ల గ్రామం నుంచి కర్ణాటకకు వెళుతున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకుని కర్ణాటకకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు.

బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, మే 17: ప్రమాదవశాత్తు మరణించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు సంబంధించిన పార్టీ సభ్యత్వ బీమా చెక్కులను శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని తన స్వగృహంలో బాధిత కుటుంబ సభ్యులకు మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. బాన్సువాడ మండలం బోర్లం గ్రామానికి చెందిన జక్కా లక్ష్మణ్ చెక్కును భార్య జక్క కాశవ్వకు, పొతంగల్ మండలం హంగర్గఫారంకు చెందిన కాంబ్లే దిలీప్‌కుమార్‌కు చెందిన చెక్కును భార్య సమతా బాయికి, వర్ని మండలం హమ్నాపూర్ గ్రామానికి చెందిన సట్ట గంగామణికి చెందిన చెక్కును ఆమె తల్లి సట్ట శివ్వకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్‌గా కరంగుల సుచిత్ నియామకం

ఎల్లారెడ్డి, మే 17: ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనారిటీ చైర్మన్‌గా ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన కరంగుల సుజిత్‌కు నియామక పత్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుజిత్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీ అభివృద్ధికి క్రిస్టియన్ మైనారిటీల సమస్యల పరిష్కారం కోసం ఎల్లవేళలా కృషి చేస్తానని అన్నారు.

పారిశుధ్య పనులపై దృష్టి పెట్టాలి

బిచ్కుంద, మే 17: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని డ్రైనేజీలో పూడికలు పారిశుధ్యం తొలగింపు పనులపైనే దృష్టి పెట్టాలని బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు అన్నారు. శుక్రవారం బిచ్కుంద గ్రామ పంచాయతీని సందర్శించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. వర్షాకాలంలో ఇబ్బందులు రాకుండా ముందస్తు పనులు చేపట్టాలని ఆదేశించారు.

బోనాల్‌లో పెద్దమ్మకు బోనాలు

లింగంపేట, మే 17: మండలంలోని బోనాల్ గ్రామంలో శుక్రవారం ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పెద్దమ్మకు ఘనంగా బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలని, గ్రామం పాడి పంటలతో ఆయురారోగ్యాలతో ఆర్థికంగా బాగుండాలని కోరుకున్నారు.

సరస్వతీ దేవి ఆలయంలో భక్తుల పూజలు

బాన్సువాడ టౌన్: పట్టణంలోని విద్యాజ్ఞాన సరస్వతీ దేవి, సంగమేశ్వరా కాలనీ కనకదుర్గామాతా, కోట దుర్గమ్మ, సంతోషిమాతా ఆలయాల్లో శుక్రవారం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అర్చకులు అమ్మవారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భక్తులు సమర్పించిన నూతన వస్త్రాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులున్నారు.

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

